# తండ్రి

తండ్రి పాపని మధ్యాహ్నం కొట్టాడు. ఎరికిలది వొచ్చి పాప తన కూతుర్ని కొట్టిందని చెప్పేటప్పటికి తండ్రికి కోపం వచ్చి పాపని కొట్టాడు. తరువాత పాప తప్పులేదనీ, తను అన్యాయంగా కొట్టాననీ అతనికి తెలిసింది.

ఆ రాత్రే పాపకి జ్వరం వచ్చింది.

ఆపిల్ల మంచానికి అంటుకుని మూలుగుతూ పడుకుని వుంటే అతని హృదయం తరుక్కుపోయింది కన్నీరు కారుస్తూ పాప పక్కలో కూర్చున్నాడు.

పాప పలవరింతలు మొదలు పెట్టింది "నిజం, నాన్నా, అబద్ధం కాదు"

"అమ్మా! ఏమిటమ్మా?" అని అడిగాడు తండ్రి గద్గద స్వరంతో.

"అదే ముందు కొట్టింది నాన్నా"

"అవునమ్మా, నాదే తప్పు"

ఎవరో కొట్టటానికి వచ్చినట్టు భయపడుతూ "నాన్నా నాన్నా" అంటూ యేడ్చింది పాప.

అతని హృదయం దడదడ కొట్టుకుంది. శరీరం వొణికింది.

ఇంతలో తల్లి పాపచేతికి కాపు వెయ్యటానికి వేడినీళ్ళు తెచ్చింది— "కొంచెం అటు తిరుగు అమ్మా" అన్నది.

పాపకళ్ళు తెరిచి చూచింది "అమ్మా"

"నేనే, అమ్మా"

"నాన్న అనుకున్నా" అని యేడ్చింది పాప.

"ఏదీ, కొంచెం కాపు వెయ్యనీ"

వాళ్ళ సంభాషణ వింటూ అక్కడే నుంచున్నాడు తన తండ్రి. భార్యనీ పిల్లని కన్నెత్తి చూడటానికే సిగ్గుగా వుంది.

"అమ్మా" అన్నది పాప. జ్వర తీవ్రతకు ఆ పిల్లమాటలు తడబడుతున్నై.

"ఏం తల్లీ?" అన్నది తల్లి కాపువేస్తూ.

"సుందరమ్మ లేదూ?"

"ఉంది"

"నాతో ఆడుకోటానికి వస్తుందే-"

"అవును"

"మేము బొమ్మల పెళ్ళి చేసుకోలా మొన్న"

"ఆఁ-"

"ఆ సుందరమ్మ"

"సరే" అన్నది తల్లి, కూతురు మాటలు మానిపించాలని.

"వాళ్ళనాన్న లేడూ-"

"ఊఁ"

"నాకు బిళ్ళలుకొని పెడతాడే-"

"మరే"

"ఆయన"

"పడుకో తల్లీ".

"సుందరమ్మ నేమీ అనడు. ఏం చేసినా కొట్టడు"

తల్లి చెంగుతో కన్నీరు తుడుచుకొని శోకం దిగమ్రింగటానికి ప్రయత్నించింది.

"అమ్మా" పిలిచింది పాప.

"ఏం అమ్మా?"

"వాళ్ళ నాన్నే ప్లీడరట"

"సరే"

"సుందరమ్మే చెప్పిందే"

"పడుకో, అమ్మా, మాట్లాడకూడదు" అని వారించింది తల్లి.

"పోదు అమ్మా; నా జ్వరం పోయింది."

తల్లి పిల్ల ఒంటిమీద చెయ్యివేసి చూచింది. చెమటలు పడుతున్నై.

"జ్వరం నయమయాక జిలేబీ కొనుక్కుంటా"

"కొనుక్కుందువుగాని"

"మరి ఏమడిగినా డబ్బు లేదంటావేం?"

"ఊరుకో అమ్మా"

"సుందరమ్మ చూడమ్మా, యెన్ని కొనుక్కుంటుందో ప్లీడరుగారి కూతురు–"

తల్లి కన్నీరు తుడుచుకుంది.

"అమ్మా"

"ఆఁ"

"రాజుగారి భార్య ఎందుకు చచ్చిపోయిందే–?" అది ఆ పిల్ల పాఠాల పుస్తకంలోని కథ.

"........"

"అమ్మా?"

"ఏం, తల్లీ?"

"గొల్లపిల్లవాడు ఏమని అరిచాడే?"—అది "గొల్లపిల్లవాడు,పులి," అనే కథలోని విషయం.

"చెప్పవే?"

"పులి; పులి! అని అరిచాడమ్మా"

"మరి పులి లేదుగా?"

"లేదు"

"ఎందుకు అరిచాడు?"

తల్లికి వెంటనే జవాబు దొరకలేదు. ఇంతలో పక్కగదిలో పడుకున్న చంటిపిల్లవాడు ఏడిచాడు. తల్లి చీర కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ పిల్లవాణ్ని ఓదార్చటానికి వెళ్ళింది. అప్పటిదాకా కొంచెం దూరంగా నుంచుని సంభాషణ వింటున్న తండ్రి మళ్ళీ పాప పక్కలో కూర్చున్నాడు. పాప ఆలోచిస్తున్నట్టు కనిపించింది. అతనికి భయం వేసింది—"పాపా!" అన్నాడు.

"ఆ పిల్ల ఉలిక్కిపడ్డది. బెదరిపోతున్నట్టు బిత్తరి చూపులు చూసింది భయంతో వొణికిపోయింది. "ఒట్టిది, నాన్నా—నిజం, నాన్నా—నేను అబద్ధం ఆడను—కొట్టకు, నాన్నా" అన్నది. తాను కొట్టబోయినప్పుడు చూచిన చూపులే చూచింది. అట్లాగే భయపడింది, అట్లాగే వొణికింది.

"నాన్నా, నాన్నా, నాన్నా!" కుంచుకు కుంచుకు పోయి ఎక్కెక్కి ఏడవటం మొదలుపెట్టింది.

అతనికేమీ తోచలేదు. కన్నీరు బొటబొట కారింది.

కూతురు ఏడుపు విని, 'అంబా' అంటూ లేగదూడ దగ్గరకు పరిగెత్తుకు వచ్చే గోవుకు మల్లే వచ్చింది తల్లి "మీరు వెళ్ళండి. మీరు కనపడితే భయపడుతోంది పిల్ల" అంటూ కూతురు పక్కలో కూర్చుని వోదార్చింది.

ఆ మాటకు తండ్రి చకితుడయ్యాడు. తను తన పిల్లల పాలిట యమకింకరుడు. తన గాలి సోకితే నే వాళ్ళ గుండె లవిసి పోతున్నాయి. నెమ్మదిగా గది బయటికి వెళ్ళాడు.

పాప మళ్ళీ శాంతించింది. మళ్ళీ తల్లికి మాటలు చెపుతూ వుంది.

"అమ్మా!"

"ఏం, తల్లీ?"

"దండించటం అంటే ఏమిటి?"—"రాజుగారికి కోపమురాగా రాణిని దండించెను" అనే వాక్యం ఆ పిల్లపాఠంలోది.

"............"

పాప మళ్ళీ అడిగింది.

"రాణి ఎవరే అమ్మా"

"రాజుగారి భార్య, తల్లి"

"దండించటం అంటే"

"కొట్టటం"—తల్లి శోకాన్ని ఆపుకోలేకపోయింది.

తల్లినుంచి 'కొట్టటం' అనేమాట వినేటప్పటికి పాప మళ్ళీ వులిక్కిపడి, బెదిరిపోతున్నట్లు విచిత్రర చూపులు చూసింది. భయంతో వొణికిపోయింది. కుంచుకు కుంచుకుపోతూ, "ఒట్టేది, నాన్నా—నిజం. నాన్నా; నేను అబద్ధం ఆడను—కొట్టకు కొట్టకు నాన్నా, నాన్నా; నాన్నా" అంటూ ఎక్కెక్కి యేడవటం మొదలు పెట్టింది.

తల్లి హృదయం బ్రద్దలయింది. కూతుర్ని కావిలించుకు పడుకుని భోరున ఏడ్చింది—"నాతల్లీ! నీకెంత కష్టం ఒచ్చిందే" అని.

తెల్లవారి పాపకి తగ్గింది. కాని, ఆమె తన భర్తను క్షమించలేదు. ఆమె హృదయంలో అతనికి స్థానం లేకుండా పోయింది.

)o....o(